

చీనీ టన్ను రూ.24,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.24,500, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



రైతుల బతుకులపై గ్రానైట్

రొళ్ల మండలం గుడ్డగుర్కి పంచాయతీ గొట్టుగుర్కి వద్ద ఉన్న బద్దికొండలో చేపట్టిన గ్రానైట్ తవ్వకాలు రైతుల బతుకులను చీకటి మయం చేస్తున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
40.1°/22.2°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

అల్లూరి జీవితం ఆదర్శప్రాయం



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: గిరిజనుల హక్కుల కోసం బ్రిటిష్ వారితో పోరాడి ప్రాణాలు అర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ చేతన్ ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి చరిత్ర ఓ ప్రత్యేక అధ్యాయమన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయ సారథి, కలెక్టరేట్ ఏఓ వెంకటనారాయణ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత కొరవడితే ఉపేక్షించం

- ధర్మవరం రైల్వేస్టేషన్ పనులను పరిశీలించిన డీఆర్‌ఎం



రైల్వేస్టేషన్‌లోని పనులను పరిశీలిస్తున్న గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్త

ధర్మవరం: రైల్వే పనుల్లో నాణ్యత కొరవడితే ఉపేక్షించబోమని గుంతకల్లు రైల్వే డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్త, సీనియర్ డివిజనల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం వారు ధర్మవరం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. విశ్రాంత గది, లోకో పైలెట్, గార్డు గదులను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. డీఆర్‌ఎం వెంట రైల్వే స్టేషన్ మేనేజర్ చల్లా నరసింహనాయుడు ఉన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో టీచర్‌కు జైలు

హిందూపురం: చెక్‌బౌన్స్ కేసులో ఓ ఉపాధ్యాయురాలికి 3 నెలల జైలు శిక్ష విధిస్తూ హిందూపురం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య బుధవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. లేపాక్షి మండలం మైదుగోళంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సత్యవతి రూ.3 లక్షల చెక్కును నేత్రావతి అనే మహిళకు ఇచ్చింది. ఆ చెక్కును బ్యాంకులో తీసుకెళ్లగా ఆకౌంట్‌లో డబ్బు లేని కారణంగా చెక్కు బౌన్స్ అయ్యింది. దీంతో సత్యవతి తనను మోసం చేసిందని నేత్రావతి కోర్టులో కేసు దాఖలు చేసింది. ఈ కేసు బుధవారం విచారణకు రాగా, పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి రమణయ్య నిందితురాలు సత్యవతికి మూడు నెలల జైలు శిక్ష విధించారు. అంతేకాకుండా నేత్రావతికి వెంటనే రూ.3 లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు. కాగా నిందితురాలు అప్పీలు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తూ బెయిల్ మంజూరు చేశారు.



బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి వద్ద క్షతగాత్రులకు చికిత్స అందించే విధానం వివరిస్తున్న దృశ్యం



ధర్మవరం రైల్వే స్టేషన్‌లో సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పిస్తూ..



ఉగ్రదాడులు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై కదిరి రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్



సత్యసాయి విమానాశ్రయంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న స్పెషల్‌పార్టీ పోలీసులు

అంతటా.. అలర్ట్

దేశ సరిహద్దులో ఏర్పడిన అలజడి నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఉగ్రవాద దాడులు జరిగితే ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి, ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించింది. పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయంలో మాక్ డ్రిల్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న పర్యవేక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రకృతి సహకరించక పోయినా ఆరుగాలం శ్రమించి స్వేదంతో పంట పండించిన రైతన్నకు అప్పులే మిగులుతున్నాయి. ఆదుకోవాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అన్నదాత ఇంట చీకట్లు అలుముకుంటున్నాయి. కనీసం కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో కాస్తాకూస్తో పండిన పంటను దళారులకు అప్పజెప్పాల్సిన దుస్థితి తలెత్తింది.





రోడ్డుపై ఆరబెట్టిన వరి ధాన్యం

ధర కుదేలు..
రైతు దిగాలు

పంటలకు 'మద్దతు' కరువు

- కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తని కూటమి సర్కార్
- మామిడి మార్కెటింగ్ గురించి పట్టించుకోని వైనం
- దళారులకు పంట అప్పజెప్పి నష్టపోతున్న రైతన్నలు

పుట్టపర్తి: పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతుకు ఏ కష్టమూ కలగకుండా చూస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా కనీసం అడుగు కూడా ముందుకు వేయలేదు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు కోల్పోయినా ఆదుకోని ప్రభుత్వం...అరకొర పండిన పంటకూ 'మద్దతు' ఇవ్వకుండా రైతును ఏడిపిస్తోంది. జిల్లాలో కనీసం ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయకపోవడంతో రైతు రైతుల కష్టం దళారీ పాలవుతోంది.

వరి.. కన్నీరు మిగిలి..

జిల్లాలో ఈ సీజల్‌లో 10 వేల హెక్టార్లలో వరి సాగు చేయగా.. ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సరాసరిన 8,75,000 క్వింటాళ్ల వరి ధాన్యం రైతు ఇంటికి చేరింది. మద్దతు ధర దక్కితే కష్టాల నుంచి బయటపడతామని రైతులు భావించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం సాధారణ రకానికి క్వింటా రూ.2,300, ఏ-గ్రేడ్‌కు రూ.2,320గా మద్దతు ధర ప్రకటించింది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇంతవరకూ రైతుకు మద్దతు ధర దక్కేలా చర్యలు చేపట్టలేదు. గడచిన ఐదేళ్లలో వరి క్వింటాల్ రూ.2,500 నుంచి రూ.3,100 వరకు ధర పలికింది. ఈ సీజన్‌లో రూ.1,600 నుంచి రూ.2,200లోపే ధర పలుకుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా పంట సేకరించి మద్దతు ఇవ్వాల్సి ఉన్నా...మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో రైతులు పంటను దళారులకు విక్రయించి నష్టాలు మూటగట్టుకుంటున్నారు.



ధర లేక రైతు ఇంట్లోనే ఉంచుకున్న మామిడి కాయలు

రాలిన మామిడి రైతుల ఆశలు..

జిల్లాలో 20 వేల హెక్టార్లలో రైతులు మామిడి సాగు చేశారు. గాలీవానకు కాయలన్నీ రాలిపోగా కాస్తా కూస్తో అందిన దిగుబడి అమ్ముకుందామంటే మార్కెట్‌లో సరైన ధర లభించడం లేదు. గత కరోనా సమయంలో సైతం మామిడి రైతులకు గిట్టుబాట ధర లభించింది. గత రెండేళ్లుగా మామిడి బేనీషా టన్ను ధర రూ.లక్ష పలికింది. దీంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బేనీషా టన్ను రూ.30 వేల నుంచి రూ.50 వేలలోపే పలుకుతోంది. దీంతో కనీసం పెట్టుబడి కూడా దక్కని పరిస్థితుల్లో మామిడి రైతు నిండా మునిగిపోయాడు.

చీనీ రైతులకు భారీ నష్టం..

గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా చీనీ కాయల ధర భారీగా పడిపోయింది. గతంలో టన్ను రూ.లక్ష వరకు పలికింది. ప్రస్తుతం కేవలం రూ.20 వేలు మాత్రమే పలుకుతోంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన పాలకులు..


ప్రధాన పంటలకూ మద్దతు ధర దక్కని దుస్థితి నెలకొన్నా.. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద కనీసం క్వింటా పంటను కూడా కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. అసలు జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశాన్నే పూర్తిగా పక్కన పెట్టేసింది. ఇక అన్నదాతా సుఖీభవ కింద పెట్టుబడి సాయం ఇంతవరకూ ఇవ్వలేదు.. కరువు సాయం, పంట నష్ట పరిహారం, పంటల బీమా రక్షణ గురించి మాట్లాడే వారే కరువయ్యారు. వెరసి 'కూటమి' పాలనలో రైతన్నల బతుకు దుర్భరంగా మారింది.

గిట్టుబాటు ధర కల్పించాలి



గత ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాట ధర కల్పించి రైతులను ఆదుకుంది. కూటమి ప్రభుత్వం కూడా గిట్టు బాటు ధర కల్పించాలి. నేను 30 ఎకరాల్లో మామిడి సాగు చేశా. పంట దిగుబడులు అరకొరగా వచ్చాయి. ఇలాంటి సమయంలో గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులు మేలు జరిగేది. కానీ ఇంత వరకూ ఆ దిశగా అడుగులు పడలేదు. దీంతో పంటను తక్కువ ధరకే దళారులకు అప్పజెప్పాల్సి వస్తోంది. – విజయభాస్కర్‌రెడ్డి, రామసాగరం, బుక్కపట్నం మండలం.

రూ.లక్షల్లో నష్టపోయాం



నేను 15 ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గతంలో వరి క్వింటా రూ.2,800 నుంచి రూ.3,200 వరకు ధర ఉండేది. ప్రస్తుతం రూ.1,800 ధర పలుకుతోంది. గతంతో పోల్చుకుంటే క్వింటాల్‌కు కనీసం రూ.1,000 తక్కువగా ఉంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే రైతులకు మద్దతు ధర దక్కేది. కానీ జిల్లాలో ఒక్క కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాకపోవడంతో వ్యాపారులు చెప్పిన రేటుకు పంటను విక్రయించా. దీంతో నేను రూ.5 లక్షల వరకూ నష్ట పోయా.

– చంద్ర, రైతు, బుక్కపట్నం

వందే వాసవీ కన్యకాం స్మితముఖీం



హిందూపురంలో బంగారు వజ్రాల పట్టుచీర అలంకరణలో దర్శనమిస్తున్న వాసవీమాత

వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు, నగరోత్సవాలు నేత్రోత్సవంగా సాగాయి. ఆయా ప్రాంతాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. – సాక్షి, నెట్‌వర్క్

'ఆపరేషన్ సింధూర్' అద్భుతం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్



పెనుకొండ రూరల్: పహల్గామ్ ఉగ్రదాడికి 'ఆపరేషన్ సింధూర్'తో కేంద్రం దీటైన సమాధానం ఇచ్చిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ అన్నారు. నిజంగా ఇది అద్భుతమైన నిర్ణయమన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్ సైన్యం ఏకకాలంలో 9 చోట్ల దాడులు నిర్వహించి ఉగ్రవాదులను మట్టుబెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. భారత నేవీ, ఆర్మీ, వైమానిక దళాల్లో మహిళలు కూడా ముఖ్య భూమిక పోషించడం స్త్రీ జాతికి గర్వకారణమన్నారు. ఉగ్రమూకలను అంతం చేయడంలో కల్నల్ ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ పాత్ర ఎప్పటికీ మరువలేమన్నారు. నిత్యం దాడులకు తెగబడుతున్న ఉగ్రవాదులకు 'ఆపరేషన్ సింధూర్' గట్టి సమాధానమన్నారు. భారత సైనికుల వీరోచిత పోరాటానికి 'ఆపరేషన్ సింధూర్' నిదర్శనంగా నిలిచిందన్నారు.

7 నుంచి రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: నూతన రేషన్ కార్డుల కోసం ఈనెల 7వ తేదీ నుంచి గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. అలాగే ఇప్పటికే ఉన్న కార్డుల్లోని వివరాలు మార్పులు, చేర్పులకూ అవకాశం కల్పించామన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఇప్పటికే 16,89,531 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్టు కార్డులను అందజేసేందుకు సిద్ధమైందన్నారు. స్మార్ట్ కార్డుపై ఉన్న క్యూ ఆర్‌కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం



పార్టీ శ్రేణులతో కలిసి బత్తలపల్లిలో 'సేవ్ ఆర్డీటీ' కార్యక్రమంలో పాల్గొన్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరించాలి
- 'సేవ్ ఆర్డీటీ' కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) సంస్థ వరదాయనిలాంటిదని, అలాంటి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన కార్యకర్తలతో కలిసి బత్తలపల్లిలో 'సేవ్ ఆర్డీటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఫాదర్ విన్సెంట్ సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... 1969లో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ప్రారంభించిన ఆర్డీటీ సంస్థ విద్య, వైద్యం, క్రీడలు, పేదలకు జీవనోపాధులు కల్పించడంలో ఇతోధిక సేవలందిస్తోందన్నారు. ఈ సంస్థ ద్వారా నిస్వార్థంగా 3,500 గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ఎస్సీ, ఎస్టీలకు గృహాలు నిర్మించి ఇస్తోందన్నారు. కరోనా వంటి కష్ట కాలంలోనూ ఆర్డీటీ సంస్థ సేవా దృక్పథంతో వైద్య సేవలందించి దేశవ్యాప్తంగా మన్ననలు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి సంస్థ మనుగడను ప్రశ్నార్థకం చేసే విధంగా ఎఫ్‌ఆర్‌సీఏ (ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్స్) పునరుద్ధరించక పోవడంతో అన్యాయమన్నారు. దీనివల్ల విదేశీ దాతల నిధులు ట్రస్ట్‌కు అందే అవకాశం ఉండదని, దీని ప్రభావం సంస్థ కార్యకలాపాలపై పడుతుందన్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌ఆర్‌సీఏను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ధర్మవరం, బత్తలపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రొళ్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు



జీజీ హట్టి వైద్య శిబిరంలో చికిత్సనిర్వహిస్తున్న సిబ్బంది

అదుపులోకి రాని అతిసారం

- జీజీ హట్టిలో తాజాగా మరో 11 కేసులు

రొళ్ల: మండల పరిధిలో జీజీ హట్టి గ్రామంలో ప్రబలిన అతిసారం అదుపులోకి రావడం లేదు. అతిసారంతో బాధపడుతూ అమూల్య(11) మంగళవారం మృతి చెందగా.. మరో 24 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై వివిధ ప్రాంతాల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కూడా వైద్య సిబ్బంది జీజీ హట్టి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి బాధితులకు వైద్య చికిత్సలు అందించారు. అయినా బుధవారం కొత్తగా 11 అతిసారం కేసులు బయటపడ్డాయి. కమలమ్మ, లక్ష్మక్క, అమృతతో పాటు ఈరమ్మ, మూడేళ్ల బాలిక రచన, రెండేళ్ల బాలిక మధుప్రియ, పిపన్న, చిక్కీరప్ప, మారన్న, వైష్ణవి, మౌనిక తదితరులు అతిసారంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బంధువులు వారిని కర్ణాటకలోని శిరతో పాటు హిందూపురం జిల్లా ఆస్పత్రి, రొళ్ల సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయిస్తున్నారు. దీంతో జీజీ హట్టిలో అతిసారం కేసుల సంఖ్య 36కు చేరింది.

తాగునీరు కలుషితం కావడం వల్లే...

జీజీ హట్టిలో రక్షిత తాగునీటి పథకం లేకపోవడంతో గ్రామస్తులు టీడీ పల్లి, ఆగ్రహారంల నుంచి, సమీపంలోని వ్యవసాయ బోర్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. ఆ నీటిని తాగడం వల్లే అతిసారం బారిన పడినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. బుధవారం డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి, డీఈ మనునాయక్, డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి, తహసీల్దార్ షేక్షావలి, ఎంపీడీఓ రామారావు, కార్యదర్శి శ్రీనాథ్, వివిధ శాఖల అధికారులు గ్రామంలో పర్యటించారు. ఇక స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు కూడా బుధవారం జీజీ హట్టి గ్రామాన్ని సందర్శించారు. అతిసారం ప్రబలడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అతిసారం పూర్తిగా తగ్గు ముఖం పట్టే వరకు వైద్య శిబిరాన్ని కొనసాగించాలని సూచించారు. అనంతరం రొళ్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

క్లుప్తంగా

దేశ చరిత్రలో మహోజ్వల శక్తి అల్లూరి



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: దేశ చరిత్రలో ఓ మహోన్నత మైన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని ఎస్పీ రత్న కొనియాడారు. స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరు సీతారామరాజు వర్ధంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి ఎస్పీ రత్న పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమంలో అల్లూరి సీతారామరాజు సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన త్యాగం అజరామరమని కొనియా డారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివా సులు, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సర స్వతి, ఆర్ఐలు మహేష్, వలి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

పరిగిలో చోరీ



రామకృష్ణ ఇంటి ముందు తచ్చాడుతున్న అనుమానిత వ్యక్తి (సీసీ కెమెరా ఫుటేజీ)

పరిగి: స్థానిక 90 ఇండ్ల అంబేద్కర్ నగర్‌లో నివాసముంటున్న రైతు రామకృష్ణ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. 40 ఇండ్ల ఎస్సీ కాలనీలో నివాసముంటున్న తన అన్న కుమార్తె వివాహ వేడుకలో పాల్గొనేందుకు మంగళవారం రాత్రి 10 గంటలకు ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి రామకృష్ణ వెళ్లాడు. బుధవారం వేకువజామున హిందూపురానికి వెళ్లి కూరగాయలను తీసుకువచ్చాడు. అనంతరం తన ఇంటి వద్దకు వెళ్లాడు. అప్పటికే తాళం బద్దలుగొట్టి తలుపులు తీసి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించాడు. బీరువాలో ఉంచిన దాదాపు 10 తులాల బంగారు నగలు, రూ.50 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఓ ఇంటి వద్ద అమర్చిన సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తే అందులో ఇద్దరు వ్యక్తులు అర్ధరాత్రి దాటిన తర్వాత రోడ్డుపై పరుగున వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

రైతుల బతుకులపై గ్రానైట్

- గ్రానైట్ తవ్వకాలతో పంట నష్టాలు
- సరైన దిగుబడులు రాక నష్టపోతున్న రైతులు
- రాయల్టీ ఎగ్గొట్టి రాత్రిళ్లు అక్రమ మార్గాన తరలింపు
- గ్రానైట్ తవ్వకాలు ఆపాలంటూ గ్రామస్తుల వేడుకోలు

రొళ్ల: మండలంలోని గుడ్డగుర్కి పంచాయతీ గొట్టుగుర్కి గ్రామ వద్ద సర్వే నెంబర్లు 152, 157తో పాటు 93లోని 40 ఎకరాల్లో విస్తరించిన బద్దికొండలో చేపట్టిన గ్రానైట్ తవ్వకాలు రైతుల బతుకులను చీకటి మయం చేస్తున్నాయి. ఈ కొండలో విలువైన కలర్ గ్రానైట్ ఉన్నట్లుగా పసిగట్టిన కొందరు టీడీపీ నాయకులు మూడేళ్ల క్రితం అనుమతులు పొంది తవ్వకాలు చేపట్టారు.

హద్దులు చెరిపేస్తూ..

దళితుల కులదైవంగా పూజించే ఓబుళనరసింహ స్వామి ఆలయం బద్దికొండలోనే ఉంది. ఏటా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఇదే కొండలో ఉన్న కన్నేరమ్మదొణకు విశేష ప్రాధాన్యత ఉంది. కొండ చుట్టూ రాతికట్టడమున్న బావులు, కుంటలు, చెక్ డ్యాంలు చాలా ఉన్నాయి. వర్షం కురిస్తే ఈ కుంటలన్నీ జలకళను సంతరించుకుని 165 బోర్లల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగి పంటల సాగుకు దోహదపడేవి. ఏటా భూతప్ప ఉత్సవాల్లో భాగంగా జలధి చేసే స్థలం కూడా ఈ కొండ ప్రాంతంలోనే ఉంది. అయితే కొండలో చేపట్టిన గ్రానైట్ తవ్వకాలతో కుంటల హద్దులు చెదిరిపోయాయి. చాలా వరకు కుంటలను చదును చేసి, వెలికి తీసిన గ్రానైట్‌ను నిల్వ చేస్తున్నారు. ఫలితంగా వర్షాకాలంలో కొండ ప్రాంతంలో నీరు నిల్వ లేకుండా పోతోంది. వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయి. పంటల సాగుకు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



బద్దికొండ వద్ద గ్రానైట్‌ను వెలికి తీస్తున్న దృశ్యం

పూలతోటల సాగుకు భారీ నష్టం..

బద్దికొండలో గ్రానైట్ తవ్వకాలతో గ్రామానికి అనుకుని రైతులు సాగు చేసిన చామంతి, బంతి, కనకాంబరం తదితర పూల తోటలకు భారీ నష్టం వాటిల్లుతోంది. దాదాపు 150 ఎకరాల్లో వివిధ రకాల పూలను రైతులు సాగు చేస్తున్నారు. ఇక్కడి పూల ఉత్పత్తులకు హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, దావణగెర, పావగడలో చాలా డిమాండ్ ఉంది. కొండలో గ్రానైట్ తవ్వకాలకు అనుమతి ఇవ్వడంతో భారీ వాహనాల రాకపోకలతో దుమ్ముధూళి ఎగిసి పూలతోటలను కప్పేస్తోంది. దీంతో సరైన దిగుబడులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యత లేని దిగుబడుల కారణంగా గిట్టుబాటు ధర లభ్యం కాక రైతులు నష్టపోతున్నారు.

అనుమతి రద్దు చేయాలంటూ డిమాండ్..

మూడేళ్ల క్రితం బద్దికొండలో గ్రానైట్ వెలికి తీతకు ఆరుగురు వ్యాపారులకు అధికారులు లీజు అనుమతులు ఇచ్చారు. దీంతో అందరూ పనులు ప్రారంభించి సుమారు ఒకటిన్నర సంవత్సరం పాటు ఏకధాటిగా గ్రానైట్ తవ్వకాలు చేపట్టారు. ఈ క్రమంలోనే సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఐదుగురు తమ కార్యకలాపాలను స్వచ్ఛందంగా విరమించుకున్నారు. ఓ వ్యాపారి మాత్రం ఇప్పటికీ గ్రానైట్ తవ్వకాలు కొనసాగిస్తున్నాడు. గ్రానైట్ తవ్వకాలతో తాము పంట నష్టపోతున్నామని, వెంటనే పనులు ఆపి, అనుమతులు రద్దు చేయాలంటూ గతంలో అనంతపురం కలెక్టరేట్ ఎదుట గ్రామ రైతులు ధర్నా చేపట్టి, మైనింగ్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తుల వినతిపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

రాయల్టీ ఎగ్గొట్టి..

బద్దికొండలో మూడేళ్లుగా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా పెద్ద ఎత్తున గ్రానైట్‌ను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టిన మైనింగ్, విజిలెన్స్ అధికారులు... అక్కడ అక్రమ లావాదేవీలు జరుగుతున్నట్లుగా నిర్ధారించారు. తనిఖీ సమయంలో లీజుదారుడు అందుబాటులో లేకుండా పోవడం.. ఆ తర్వాత సదరు అధికారులపై ఒత్తిళ్లు తీసుకెళ్లి తన అక్రమ వ్యాపారాన్ని మరింత విస్తరించుకోవడం గమనార్హం. వెలికి తీసిన గ్రానైట్‌లో అత్యధిక భాగం రాత్రి సమయంలోనే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.



వెలికి తీసిన కలర్ గ్రానైట్

కుంటలన్నీ మాయం



బద్దికొండలో గ్రానైట్ తవ్వకాలతో కొండకు ఆనుకుని ఉన్న కుంటలన్నీ మాయమయ్యాయి. భారీ వాహనాల రాకపోకలతో పంట నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. గ్రానైట్ తవ్వకాల అనుమతులను రద్దు చేయాలి.

– నరసింహమూర్తి, గొట్టుగుర్కి గ్రామం

పూర్తిగా నిషేధించాలి



రోజూ రాత్రి వేళల్లో భారీ వాహనాలు తిరుగుతున్నాయి. దీంతో దుమ్ముధూళి పంటలపై పడి నష్టపోతున్నాం. కుంటలు మాయమై భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ప్రజలూ శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. బద్దికొండలో గ్రానైట్ తవ్వకాన్ని పూర్తిగా నిషేధించాలి.

– శ్రీరామప్ప, గొట్టుగుర్కి గ్రామం

ఏడు మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: వాతావరణ మార్పులతో జిల్లాలో వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు 7 మండలాల పరిధిలో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. అమడగూరులో అత్యధికంగా 21.4 మి.మీ వర్షం పాతం నమోదైంది. ఇక సోమందేపల్లి మండలంలో 13 మి.మీ, కొత్తచెరువు 7.8, తనకల్లు 7.8, పుట్టపర్తి 4.8, చిలమత్తూరు 2.8, బుక్కపట్నం మండలంలో 1.4 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. పగటి పూట ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వెల్లడించారు.

యువకుడి దుర్మరణం



సింహాద్రి (ఫైల్)

చిలమత్తూరు: రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. చిలమత్తూరు మండలం కొడికొండ గ్రామానికి చెందిన సింహాద్రి (20) పాలసముద్రం సమీపంలో ఉన్న కియా అనుబంధ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉన్నాడు. తండ్రి తొమ్మిదేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి అనితతో కలసి ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం విధులకు ద్విచక్ర వాహనంపై బయలుదేరిన సింహాద్రి గ్రామం విడిచి కాస్త దూరం వెళ్లగానే దిగువపల్లి తండాకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను వేగంగా ఢీకొన్నాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తల్లి అక్కడకు చేరుకుని కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కారు బోల్తా – వ్యక్తి మృతి

చిలమత్తూరు: కారు బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని గుడిబండకు చెందిన వాజీద్ (40) గోరంట్లలో పెళ్లి చేసుకున్నాడు. మంగళవారం అర్ధ రాత్రి కారులో అత్తారింటికి బయలుదేరిన ఆయన చిలమత్తూరు మండలం కోడూరు – గోరంట్ల ప్రధాన రహదారిపై పెద్దనపల్లి క్రాస్ వద్ద చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను గమనించకుండా అతి వేగంగా దూసుకెళ్లి మట్టి దిబ్బను ఢీకొన్నాడు. ఘటనలో కారు బోల్తాపడి ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య నజ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

అమరాపురం: క్షయ వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం సోమఘట్ట గ్రామానికి చెందిన హనుమంతప్ప (45)కు అమరాపురం మండలం కెంకెర గ్రామానికి చెందిన జ్యోతితో వివాహమైంది. పెళ్లి తర్వాత కెంకెర గ్రామంలోని స్థిరపడి వ్యవసాయ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం క్షయ వ్యాధి నిర్ధారణ కావడంతో చికిత్స పొందుతున్నాడు. అయినా జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన మంగళవారం రాత్రి తన ఇంటి వారపాకలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం విషయాన్ని గుర్తించిన భార్య సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నలుగురి అరెస్ట్

కదిరి అర్బన్: మండలంలోని బాలప్పగారిపల్లితండా, మరువతండా గ్రామాల్లో నాటుసారా తయారు చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు కదిరి ఎక్సైజ్ పీఎస్ ఎస్ఐ శ్రీధర్ బుధవారం తెలిపారు. అలాగే చిగురుమానుతండాలో నాటుసారా విక్రయిస్తున్న భాస్కర్‌నాయక్‌ని రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు.

మామిడి చెట్ల దగ్ధం

తలుపుల: మండలంలోని గంజివారిపల్లికి చెందిన రైతు హుస్సేన్ తోటలో మామిడి చెట్లు కాలిపోయాయి. తన తోట పక్కన ఉన్న పొలాల గట్లపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి తోటను చుట్టుముట్టాయని బాధిత రైతు తెలిపాడు. అప్రమత్తమై మంటలు ఆర్పే లోపు 20 మామిడి చెట్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

లైనింగ్ పనులతో రైతులకు నష్టం

- శాంతియుతంగానే పనులను అడ్డుకోండి
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: నియోజకవర్గ వ్యాప్తంగా హంద్రీ–నీవా కాలువలో చేపట్టిన లైనింగ్ పనులతో రైతులు తీవ్రంగా నష్టపోతారని, ఈ అంశంపై అన్నదాతలను చైతన్య పరచాలని ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులకు రాప్తాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సూచించారు. బుధవారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన అనంతపురానికి వెళుతున్న ఆయన స్థానిక 44వ జాతీయ రహదారి వద్ద తనను కలసిన చెన్నేకొత్తపల్లి, రామగిరి,కనగానపల్లి మండలాలకు చెందిన నాయకులతో మాట్లాడారు. హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులను అడ్డుకుంటారనే దురుద్దేశ్యంతోనే టీడీపీ నేతలు.. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్‌లు చేస్తున్నారని మండిపడ్డారు. లైనింగ్ పనులు జరిగితే కాలువలో నీరు ఇంకదని దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోతాయన్నారు. బోరుబావుల్లో నీరు రాకుంటే పంటలు పండక రైతులు బతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ అంశంపై రైతులను చైతన్య పరచి, హంద్రీనీవా కాలువలో లైనింగ్ పనులను ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, కన్వీనర్లు, సర్పంచ్‌లు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



అభిమానులతో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

‘అనంత’ అభివృద్ధే లక్ష్యం కావాలి

- జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 మంది ఎంపీడీఓలకు మండలాల కేటాయింపు

అనంతపురం సిటీ: విధి నిర్వహణలో అంకిత భావం, చిత్తశుద్ధితో పని చేస్తూ.. జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని నూతనంగా పోస్టింగ్ అందుకున్న ఎంపీడీఓలకు జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో పని చేస్తున్న పది మంది పరిపాలనాధికారులు, డిప్యూటీ ఎంపీడీఓ (ఈఓఆర్‌డీ)లతో పాటు నంద్యాల నుంచి ముగ్గురు, కర్నూలు నుంచి ఇద్దరు అధికారులకు రెగ్యులర్ ఎంపీడీఓలుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పదోన్నతిపై వచ్చిన 15 మందిలో 10 మందిని శ్రీసత్యసాయి జిల్లా, ఐదుగురిని అనంతపురం జిల్లాకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి మండలాలు కేటాయిస్తూ బుధవారం తన చాంబర్‌లో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యతో కలసి జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఉత్తర్వులు అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉండగా, 15 మంది వచ్చారని, త్వరలో మిగిలిన పోస్టులు కూడా భర్తీ అవుతాయని డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్లానింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్ ఏఓలు రత్నాబాయి, నియాజ్ అహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ లీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న ఎంపీడీఓలతో జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య

మండలాల వారీగా నియమితులైన ఎంపీడీఓలు

మండలం	ఎంపీడీఓ
తలుపుల	నసీమ
సోమందేపల్లి	వెంకటలక్ష్మమ్మ
తనకల్లు	ఐ.మమతాదేవి
పరిగి	రెడ్డెప్ప
నంబులపూలకుంట	ఆర్.పార్థసారథి
చిలమత్తూరు	జి.కరుణసాగర్
చెన్నేకొత్తపల్లి	ఎం.బాలకృష్ణుడు
రొళ్ల	వై.నాగేశ్వరశాస్త్రి
గుడిబండ	పి.కేశవరెడ్డి
కొత్తచెరువు	ఏజీ నటరాజ్
కళ్యాణదుర్గం	వి.ధనుంజయనాథ్
బ్రహ్మసముద్రం	వి.విజయసింహారెడ్డి
కంబదూరు	ఎం.సూర్యనారాయణ
వజ్రకరూరు	వి.శివాజీరెడ్డి
శెట్టూరు	టి.జిలాన్‌బాషా

తీరిన ‘డైట్’ అధ్యాపకుల కొరత

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (డైట్)లో అధ్యాపకుల కొరత తీరనుంది. ముగ్గురు సీనియర్ అధ్యాపకులు, ఆరుగురు అధ్యాపకులను ఫారెన్ సర్వీస్ కింద నియమిస్తూ పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ అధ్యాపకులుగా అమడగూరు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పి.శ్రీధర్‌బాబు, రొద్దం మండలం తురకలాపట్నం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పెనుకొండ శివరాం, గుమ్మఘట్ట మండలం పూలకుంట జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అవులపల్లి అస్లాంబాషాను నియమించారు. అధ్యాపకులుగా కణేకల్లు బాలుర జెడ్పీహెచ్ఎస్ బీఎస్ టీచరు వేలూరు లక్ష్మీనరసింహ, కొత్తచెరువు మండలం చెన్నరావుపల్లి జెడ్పీహెచ్ఎస్ ఇంగ్లిష్ టీచరు లింగుట్ల రమేష్‌నాయుడు, పరిగి మండలం పి.నరసాపురం జెడ్పీహెచ్ఎస్ ఇంగ్లిష్ టీచరు బైరప్పగారి ఆదర్శ్, రామగిరి మండలం పేరూరు జెడ్పీహెచ్ఎస్ గణితం టీచరు మైలారి మాలతీదేవి, పెనుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బీఎస్ టీచరు ఎస్‌పీ ప్రభాకర్, తలుపుల మండలం ఓబుళరెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్ బీఎస్ టీచరు పసల లోకనాథరెడ్డిని నియమించారు. డైట్ అధ్యాపకుల నియామకానికి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తు చేసుకున్న హెచ్ఎంలు, టీచర్లకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. మెరిట్ ఆధారంగా జాబితా రూపొందించి కలెక్టర్ సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఫైనల్ జాబితాను ఎంపిక చేసి ఆమోదం కోసం కమిషనర్‌కు పంపారు. ఈ క్రమంలో కమిషనర్ ఆమోదముద్ర వేశారు. ఎంపికైన వారందరూ గురువారం బాధ్యతలు చేపట్టనున్నారని డీఈఓ ప్రసాద్‌బాబు వెల్లడించారు.

సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందాలి

- ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ



మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ

బుక్కరాయసముద్రం: రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందేలా చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ సూచించారు. బీకేఎస్ మండలం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో అత్యల్ప వర్షపాత మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. రానున్న ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకుని రైతాంగానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. పంటల సాగులో మెలకువలు, సూచనలు సలహాలు నిరంతరం అందించాలన్నారు. అనంతరం రైతాంగ పంటల సాగు, వివిధ రకాల పంటలలో యాజమాన్య పద్ధతులపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పరిశోధన స్థానం సంచాలకులు డాక్టర్ జాన్సన్, ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, రేకులకుంట పరిశోధనా స్థానం అధిపతి విజయశంకర్‌బాబు, రెడ్డిపల్లి ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త భార్గవి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర పాల్గొన్నారు.

విద్యార్థిని సన్మానించిన మంత్రి

ఓడీచెరువు: స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉంటూ పదో తరగతిలో 570 మార్కులతో టాపర్‌గా నిలిచిన విద్యార్థి పి.అజిత్‌కుమార్‌ను బుధవారం విజయవాడలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థిని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి శివరంగ ప్రసాద్ అభినందించారు.



అజిత్‌కుమార్ ను సన్మానిస్తున్న మంత్రి సంధ్యారాణి

సూర్యఘర్ లక్ష్యం వంద శాతం నెరవేరాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా జిల్లాకు కేటాయించిన 65వేల యూనిట్ల లక్ష్యాన్ని వంద శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీ, ఉపాధి పనులు, పీఎం సూర్యఘర్‌తో పాటు వివిధ పథకాల అమలుపై సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టర్ సమీక్షించారు. పీయం సూర్యఘర్ పథకం లక్ష్య సాధనకు ఎమ్మెల్యేలు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఎంలు సమన్వయం చేసుకుని ఎస్పీడీసీఎల్ ఎస్ఈతో కలిపి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే హెచ్ఎన్ఎస్ఎస్, జాతీయ రహదారుల భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. పశువుల నీటి తొట్టెలు, ఫారం పాండ్లు, పశువుల షెడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్ కుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, సోలార్ పవర్ అధికారి వివేక్, డీపీఓ సమత, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి టౌన్: ఈ నెల 9న సీఎం చంద్రబాబు అనంతపురం పర్యటన నేపథ్యంలో పుట్టపర్తి విమానాశ్రయాన్ని బుధవారం కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న పరిశీలించారు. శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తిలోని విమానాశ్రయానికి సీఎం చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ భద్రతా ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. సీఎం పర్యటన ముగించుకుని తిరిగి వెళ్లేంత వరకూ భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తరాదని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, విమానాశ్రయాధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లపై ఆరా తీస్తున్న కలెక్టర్, ఎస్పీ

కల్పవృక్షంపై శ్రీవారు



ధర్మవరం అర్బన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు బుధవారం ఉదయం కల్పవృక్షంపై భక్తులకు లక్ష్మీచెన్నకేశవస్వామి దర్శనమిచ్చారు. సాయంత్రం హనుమద్వాహన సేవలు నేత్రపర్వంగా సాగాయి.